

తాడికొండ వద్ద పర్యాటకుల కోసం నిర్మాణం ఇలా..

జలపాతాలకు మహర్దశ



గుమ్మలక్ష్మీపురం మండలంలో తాడికొండ జలపాతం

- వాటి అభివృద్ధికి చర్యలు
- మౌలిక వసతుల కల్పనపై దృష్టి
- స్వచ్ఛందంగా ముందుకొస్తున్న గిరిజనులు
- రుణాలిచ్చి.. మహిళా సంఘాలతో దుకాణాల ఏర్పాటు
- పర్యాటకులను ఆకట్టుకునేలా పనులు

పార్వతీపురం/సాలూరు రూరల్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలపాతాలకు మహర్దశ పట్టింది. వాటి అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో పర్యాటకులకు అవసరమైన అన్ని వసతుల కల్పనకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. కొన్నిచోట్ల గిరిజనులే ముందుకొచ్చి స్వచ్ఛందంగా పనులు చేపడుతున్నారు. ఇప్పటికే గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండ జలపాతం వద్ద పర్యాటకుల కోసం అన్ని వసతులు కల్పించారు. దుకాణ సముదాయాలను కూడా ప్రారంభించారు. వాష్ రూమ్‌లు, ఇతర సదుపాయాలను కూడా కల్పించారు. ఇక జిల్లాలో సాలూరు మండలంలో లొద్ద, దళాయివలసలో పల్లం పణుకు, కురుకూటి, శిఖపరువు, పాచిపెంట మండలంలో ఆలూరు తదితర జలపాతాలు అభివృద్ధికి కార్యాచరణ సిద్ధం చేశారు. వాటి పనులపై కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో జలపాతాలకు వెళ్లడానికి రహదారి, పర్యాటకులకు అవసరమైన తాగునీరు, ఆహారం తదితర వాటిని అందుబాటులో ఉండే విధంగా దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. గిరిజన ప్రాంతాల్లో పర్యాటకుల సౌకర్యార్థం హోం స్టే అభివృద్ధి చేయనున్నారు. మొత్తంగా పర్యాటకులను ఆకర్షించేలా జలపాతాలను అభివృద్ధి చేసి.. గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపడుతున్నారు.

రుణాలు అందించి..

డీఆర్‌డీఏ సహకారంతో మహిళా సంఘాల సభ్యులకు రుణాలందించి జలపాతాలు, పర్యాటక ప్రాంతాల్లో దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటికే జిల్లాలో పర్యాటక ప్రాంతాలను డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి పలుమార్లు పర్యటించారు. వెలుగు ఏపీఎంలు, సీసీలు సాయంతో గిరిజనుల్లో అవగాహన కల్పించారు. గిరిజనులు కూడా తమ గ్రామాల అభివృద్ధి చెందుతాయనే భావనతో స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో సాలూరు మండలం కురుకూటి సమీపంలో దళాయివలస వద్ద ఉన్న పల్లంపణుకు జలపాతం అభివృద్ధికి గిరిజనులు నడుం బిగించారు. ఈ జలపాతానికి దళాయివలస వద్ద నుంచి దాదాపు 4 కిలోమీటర్లు రోడ్డును స్వచ్ఛందంగా గిరిజనులు బాగు చేశారు. వాటర్ ఫాల్స్ వద్ద వెదురుకర్రలతో వంతెన, పర్యాటకులు దుస్తులు మార్చుకోవడానికి వీలుగా కర్రలతో రూంలను నిర్మించారు. ఇటీవల డీఆర్‌డీఏ పీడీ సుధారాణి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ జలపాతం వద్ద మహిళలకు రుణాలిచ్చి దుకాణాలను ఏర్పాటు చేయనున్నారు. నడిచి వెళ్లలేని వారిని పేయింగ్ బైక్‌లను ఏర్పాటు చేసి స్థానిక గిరిజన యువత ఉపాధి పొందేలా కార్యాచరణ చేశారు.

పర్యాటక అభివృద్ధికి చర్యలు..

'జిల్లాలో జలపాతాల ప్రాంతాల్లో పర్యాటక అబివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకుని ప్రత్యక్షంగా.. పరోక్షంగా గిరిజనులకు ఉపాధి కల్పించేందుకు కార్యాచరణ సిద్ధం చేశాం.' అని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.



సాలూరు రూరల్: శిఖపరుపు జలపాతం

ఎప్పుడిస్తారో?

- ఆరేళ్లుగా కానరాని దోమ తెరల పంపిణీ
- ప్రతిపాదనలతోనే సరి
- జిల్లాలో 698 మలేరియా ప్రభావిత గ్రామాలు
- వాటి కోసం ఎదురుచూస్తున్న మన్యం వాసులు



జియ్యమ్మవలస, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దోమ తెరల పంపిణీ జరిగి ఆరున్నరేళ్లు అయింది. దీని కాల పరిమితి ముగియడంతో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ 4 లక్షల లాంగ్ లాస్టింగ్ ఇన్‌సెక్టిసైడల్ నెట్ దోమ తెరలకు ఏడాదిన్నర కిందటే ప్రతిపాదనలు పంపించింది. కానీ నేటికీ కేంద్ర ప్రభుత్వం వాటిని మంజూరు చేయకపోవడంతో జిల్లావాసులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మన్యంలో మళ్లీ వ్యాధులు విజృంభిస్తున్నాయి. పల్లె, పట్టణ ప్రాంతాల్లో అత్యధికులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇదే సమయంలో మలేరియా, డెంగ్యూ కేసులు నమోదవుతుండడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా పరిస్థితి దారుణంగా ఉంది. ఆసుపత్రుల్లో చేరుతున్న వారికి వైద్యాధికారులు, సిబ్బంది వైద్య సేవలు అందిస్తున్నా.. పరిస్థితి అదుపులోకి రావడం లేదు. కాగా దీనికి ప్రధాన కారణం దోమలేనని జ్వరపీడితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో తక్షణమే దోమ తెరలు పంపిణీ చేయాలని వారు కోరుతున్నారు.

ఇదీ పరిస్థితి

ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో 34 మండలాల పరిధిలో 921 పంచాయతీల్లో 4,42,400 దోమ తెరలను పంపిణీ చేశారు. ఆ తరువాత నుంచి వాటి పంపిణీ జరగలేదు. 2022లో పార్వతీపురం మన్యం జిల్లాగా ఏర్పడిన తరువాత కూడా దోమ తెరలను అందించలేదు. ప్రభుత్వ వైద్య ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం దోమ తెరల కాల పరిమితి నాలుగు నుంచి ఐదు సంవత్సరాలు. అయితే పంపిణీ జరిగి ఆరేళ్లు కావస్తున్నా.. ఇంకా ఈ దోమ తెరలు

(మిగతా 9వ పేజీలో...)

సంవత్సరం	సేకరించిన రక్త నమూనాలు	మలేరియా కేసులు	హైరిస్క్ గ్రామాలు
2021	2,59,207	108	---
2022	2,63,417	502	---
2023	2,66,085	482	70
2024	4,08,725	2,653	88
2025	4,35,455	1,664	90

ప్రతిపాదనలు పంపించాం

జిల్లాకు 4.42 లక్షల దోమ తెరలు కావాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ఇంకా రాలేదు. వచ్చిన వెంటనే పంపిణీ చేస్తాం.

\- వై.మణి, జిల్లా మలేరియా అధికారి



గతంలో పంపిణీ చేసిన దోమతెర

2028 నాటికి

ఎలక్ట్రికల్ బస్సులు

- ఆర్టీసీ ఈడీ బ్రహ్మానందరెడ్డి

పార్వతీపురం టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులకు 2028 నాటికి ఎలక్ట్రికల్ బస్సుల ద్వారా సేవలు అందించనున్నట్లు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) కె.బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం పార్వతీపురం ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా విలేఖర్లతో మాట్లాడుతూ.. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు సేవలందించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు. పార్వతీపురం, పాలకొండ డిపోల్లో బస్సుల కొరత వాస్తవమేనని, అయితే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కండక్టర్లు, డ్రైవర్ల కొరత

(మిగతా 9వ పేజీలో...)



అధికారులు, కార్మిక సంఘ నాయకులతో మాట్లాడుతున్న ఈడీ బ్రహ్మానందరెడ్డి

తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వండి

- పురుగు మందు బాటిల్‌తో రామాపురం కాలనీ వాసి హల్‌చల్
- పార్వతీపురంలోని ఓ జ్యూయలర్ షాపు వద్ద హైడ్రామా

8లో

తప్పుడు ప్రచారం తగదు

- మంత్రి సంధ్యారాణి

9లో

ధాన్యం కొనుగోలుకు ముందే..

- జిల్లాలో రైస్ మిల్లుల పరిశీలన
- ఖరీఫ్ రైతులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు
- అవకతవకలకు ఆస్కారం లేకుండా నిఘా
- కదిలిన అధికారులు

గరుగుబిల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ముందుగా అధికారులు రైస్ మిల్లులను పరిశీలిస్తున్నారు. అన్నదాతలకు ఏ ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. ఈ మేరకు శనివారం జిల్లాలోని 196 రైస్ మిల్లులను పరిశీలించారు. మిషనరీతో పాటు అవసరమైన సౌకర్యాలు ఏ మేర ఉన్నాయన్న దానిపై ఆరా తీశారు. అవకత వకలకు ఆస్కారం లేకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. దీంతో పాటు ఎంతమేర విద్యుత్‌ను ఉపయోగిస్తున్నారన్న దానిపై విద్యుత్‌శాఖ అధికారులు వివరాలు సేకరి స్తున్నారు. కాగా మిల్లింగ్ చేసే సమయంలో కల్తీకి ఆస్కారం లేకుండా నిఘా ఏర్పాటు చేయను న్నారు. మిల్లుల పరిధిలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.



నాగూరులో రైస్ మిల్లును పరిశీలిస్తున్న అధికారులు

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా ఈ ఏడాది జిల్లాలో 2.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు అధికారులు అంచనా వేశారు. ఇందుకు అవసరమైన రవాణా, హమాలీలు, గోనె సంచులతో పాటు ఎంతమేర సామగ్రి అవసరం ఉందన్న దానిపై నివేదికలు సిద్ధం చేస్తున్నారు. మరోవైపు రైతుసేవా కేంద్రాల పరిధిలో పీపీసీల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. కేంద్రాల పరిధిలో కొనుగోలుకు షెడ్యూలింగ్ ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులు ఆదేశాలు

(మిగతా 9వ పేజీలో...)

ఉద్యోగులకు

శుభవార్త

- డీఏ చెల్లింపునకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

పార్వతీపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఒక డీఏ ఇవ్వాలని శనివారం నిర్ణయించింది. ఈ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీపావళి ముందు కానుక అందించింది. వాస్తవంగా గత వైసీపీ ప్రభుత్వ కాలంలో నాలుగు డీఏల బకాయిలున్నాయి. అయితే నాడు ఒక్క డీఏ కూడా చెల్లించలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు అందిస్తోంది. తాజాగా పాత బకాయిల్లో ఒక డీఏను చెల్లిస్తున్నట్లు ప్రకటించింది. కాగా మన్యం జిల్లాలో 9,725 మంది టీచర్లు, 23 వేలు ప్రభుత్వ పెన్షనర్లు, 12,500 వేల మంది ఉద్యోగులు ఉన్నారు. వీళ్లు కాకుండా వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులకు కూడా డీఏ వర్తించనుంది. ఇకపోతే పోలీసు సిబ్బందికి సరెండర్ లీవులు చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంగీకారం తెలిపారు. దీనిపై ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

- జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ పార్వతీపురంలో భాగంగా ప్రతి ఒక్కరూ విధిగా ఒక మొక్కను నాటాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచాలన్నారు. శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్వో కె.హేమలత, రెవెన్యూ సిబ్బందితో కలిసి జేసీ మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడ తాయన్నారు. స్వచ్ఛమైన గాలి మొక్కల ద్వారానే లభిస్తుందని, వాటి పెంపకంపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలని సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



మొక్కలు నాటుతున్న జాయింట్ కలెక్టర్

ఆది కర్మయోగి అభియాన్ అమలులో

మనమే ఫస్ట్!

- పార్వతీపురం ఐటీడీఏకు ప్రత్యేక గుర్తింపు

పార్వతీపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): 'ఆది కర్మయోగి అభియాన్' అమలులో రాష్ట్రంతో పాటు పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాలు జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాయి. ధాత్రి జన్ భగీరథి ద్వారా గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన కార్యక్రమాలకు గాను పార్వతీపురం ఐటీడీఏకు కూడా మొదటి స్థానం లభించింది. ఆది కర్మయోగి అభియాన్‌కు సంబంధించి ఈ నెల 17న న్యూఢిల్లీలో ఏపీ తరఫున గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.ఎం.నాయక్ రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. శిక్షణ అందించిన ఏపీవో మురళీధర్‌కు ఉత్తమ మాస్టర్ ట్రైనీగా అవార్డు లభించింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదాభార్గవి తదితరులు పాల్గొన్నారు. 'ఆదికర్మయోగి అభియాన్ అమలులో జిల్లాకు ప్రథమ స్థానం రావడం.. పార్వతీపురం ఐటీడీఏకు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం ఎంతో ఆనందంగా ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలను నెరేవర్చే విధంగా కృషి చేస్తున్న అధికారులకు అభినందనలు' అని మంత్రి సంధ్యారాణి, కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు.



ఉత్తమ మాస్టర్ ట్రైనీగా ప్రశంసా పత్రం అందుకుంటున్న ఐటీడీఏ ఏపీవో

బస్సులు కిటకిట.. రైళ్లల్లో రద్దీ

- దీపావళికి స్వస్థలాలకు చేరుతున్న ఉద్యోగులు, వలస కూలీలు

8లో

నేడు పైడిమాంబ కలశ జ్యోతి ఊరేగింపు

8లో

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

- పూతిక వలసలో ఘటన

8లో

ఆగని ఇసుక తవ్వకాలు

- గోస్తనీ వంతెనకు పొంచి ఉన్న ముప్పు
- చోద్యంచూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు



గోస్తని నదిలో ముషిడిపల్లి వద్ద జాతీయరహదారిపై ఉన్న వంతెనకు ఆనుకుని యంత్రంతో ఇసుకతవ్వుతున్న దృశ్యం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లి వద్ద గోస్తనీ నదిలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న వంతెన వద్ద యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఎటువంటి అనుమతి లేకుండా కొందరు వ్యక్తులు పగటిపూట యంత్రాలతో తవ్వి ఇసుకతరలిస్తున్నారు.ఇక్కడ ఇసుక,మట్టిని ట్రాక్టర్లతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో భవన నిర్మాణాలకోసం డెవలపలర్లకు విక్రయిస్తున్నారు. ఇక్కడ చత్తీస్‌ఘడ్ వెళ్లే జాతీయ రహదారి నిర్మాణం ఏడాది కిందటే పూర్తయ్యింది. ముషిడిపల్లి వద్ద కొత్తగా ఎన్‌హెచ్‌పై నిర్మించిన వంతెనకు ఆనుకుని 500 మీటర్లలోపై ఇసుక తవ్వకాల వల్ల ప్రమాదం పొంచిఉందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.భారీవర్షాలు కురిస్తేవంతెన కోతకు గురయ్యే ప్రమాదముందన్న భయాందోళన నెలకొంది. గోస్తనినది నుంచిజిల్లాలోని జామి, ఎస్.కోట, గంట్యాడ, విశాఖ జిల్లాలోని రెడ్డిపల్లి, పద్మనాభం తదితర మండలాల్లో 11 వేల ఎకరాలకు సాగు నీరందుతోంది. అలాగే జీవీఎంసీతోపాటు విజయనగరం నగరపాలక సంస్థకు తాగునీరందించే ఇన్‌ఫిల్టర్ బావులు కూడా నదిలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రాంతానికి సమీపంలో ఉన్నాయి. నిత్యం ఇసుకతవ్వకాల వల్ల భూగర్భ జలాలు ఇంకిపోయివేసవిలో నీటిలభ్యత తగ్గి నగరాలకు తాగునీటిముప్పుపొంచిఉందన్న ఆందోళనవ్యక్తమవుతోంది. ఇసుక తవ్వకాలపై పర్యవేక్షించి అడ్డుకోవల్సిన రెవెన్యూమైనింగ్, ఇరిగేషన్ అధికారులు చోద్యం చూస్తుండడంతో విమర్శలొస్తున్నాయి. కాగా ముషిడిపల్లి వద్ద గోస్తనీ నదిలో ఇసుక తవ్వకాలను పరిశీలిస్తామని ఇరిగేషన్ ఏఈ శంకర్ తెలిపారు.

తాకట్టు పెట్టిన బంగారం ఇవ్వండి

- పురుగు మందు బాటిల్‌తో రామాపురం కాలనీ వాసి హల్‌చల్
- పార్వతీపురంలో శ్రీ స్వామి జ్యూయలర్ షాపు వద్ద హైడ్రామా



జ్యూయలర్ షాపు వద్ద నిరసన తెలుపుతున్న విజయ్ కుటుంబసభ్యులు

పార్వతీపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తాకట్టు పెట్టిన బంగారం తిరిగి ఇవ్వాలని పట్టణంలోని రామాపురం కాలనీకి చెందిన కోట విజయ్ డిమాండ్‌చేశాడు. పట్టణంలోని ప్రధాన రహదారిలోగల శ్రీస్వామి జ్యూయలర్ దుకాణంలోకి వెళ్లి తాళాలు వేసి పురుగు మందు తాగేందుకు యత్నించాడు.దీంతో శనివారం స్వామిజ్యూయలర్స్ వద్ద హైడ్రామానడిచింది. బాధితుడు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని రామాపురం కాలనీకిచెందిన కోట విజయ్ పట్టణ ప్రధాన రహదారిలోగల శ్రీ స్వామి జ్యూయలర్స్‌యజమాని గెంబలి శంకరరావువద్ద అవసరాల నిమిత్తం 2019లో 30 తులాల బంగారం తాకట్టు పెట్టాడు. ఆర్థిక ఇబ్బందులు కారణంగా తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించుకోలేకపోయాడు. ఇంతలో జ్యూయలర్స్ షాపు యజమాని శంకరరావు కరోనా బారినపడి మృతిచెందారు. దీంతో జ్యూయలర్స్ షాపు యజమాని కుమారులు పృథ్వీరాజ్, వినయ్‌కుమార్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు తాను బంగారం తాకట్టు పెట్టిన విషయం విజయ్ చెప్పాడు.అయితే శంకరరావు కుమారులు ఇదిగో, అదిగో ఇస్తామంటూ రెండేళ్లపాటు తిప్పించుకున్నారు.చివరకుపెద్ద మనుషుల వద్ద విజయ్ పంచాయితీ పెట్టాడు. శ్రీస్వామి జ్యూయలర్స్ నుంచి 15 తులాలు ఇప్పించేందుకు పెద్ద మనుషులు మాటిచ్చారు. కానీ నాకు న్యాయం జరగకపోవడంతో పట్టణ పోలీసు స్టేషన్‌లో విజయ్ ఫిర్యాదుచేశాడు. అక్కడ కూడా న్యాయం జరగకపోవడంతో శనివారం జ్యూయలర్ షాపునకు వచ్చిన విజయ్ లోపలకు వెళ్లి తాళాలువేశాడు. పురుగు మందు తాగేందుకు యత్నించాడు. విషయం తెలుసుకున్న విజయ్ భార్యశ్రీదేవి, కూమార్తె సాయిరూపలతో పాటు ఆయన కుటుంబ సభ్యులు షాపు ఎదుట ఆందోళనకు దిగారు. ఈ విషయం పట్టణ సీఐ మురళీధర్ వద్ద ప్రస్తావించగా బాధితుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశామన్నారు. అయితే బాధితుడు విజయ్ శ్రీస్వామి జ్యూయలర్స్ వద్ద బంగారం తాకట్టు పెట్టినట్టు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొని వ్యక్తి మృతి

కురుపాం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): పూతికవలస సమీపంలో శనివారం రాత్రి గొరడ నుంచి కర్రలతో వెళ్తున్న ట్రాక్టరును బైక్‌తో వెనుక నుంచి పూతికవలసకు చెందిన రైతు గొట్టాపుగౌరినాయుడు(55) ఢీకొన్నాడు. దీంతో ఆయన తలపై బలమైన గాయమైంది. విషయం గమనించిన స్థానికులు కురుపాం ఆసుపత్రికి తరలించారు.అయితే అప్పటికే గౌరినాయుడు మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు.మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ఘటనపై కురుపాం పోలీసులు కేసు నమోదుచేశారు.

రైలు నుంచి జారిపడి ఛత్తీస్‌గడ్ వాసి..

బొబ్బిలి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరమ్మకాలనీ సమీపంలో శనివారం తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి ఛత్తీస్‌గడ్ వాసి అక్కడికక్కడే మృతిచెందాడు. రైల్వే హెచ్‌సీ బండారు ఈశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఛత్తీస్‌ఘడ్‌లోని దుర్గ్ జిల్లా పటాన్ ప్రాంతంలోని భిలాయ్ చరోడాగ్రామానికి చెందిన ఓంప్రకాశ్‌యాదవ్ (30) శ్రీకాకుళం జిల్లా పలాస నుంచి రైలులో ప్రయాణిస్తూ స్థానిక ఇందిరమ్మకాలనీ రైలు పట్టాల దగ్గర రైలు నుంచి జారిపడి మృతిచెందాడు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.మృతుడి తండ్రి ఉదయ్ సింగ్ యాదవ్‌కు సమాచారం అందించామని హెచ్‌సీ తెలిపారు.

మృతుడి ఆచూకీపై సమాచారం ఇవ్వండి

కొత్తవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినరావుపల్లికి చెందిన తిరుపతి చెరువులో శుక్రవారం గుర్తించిన మృతుడి ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వాలని కొత్తవలస సీఐ షణ్ముఖరావు ఒక ప్రకటనలో కోరారు. సీఐ కథనం మేరకు..మృతుడి వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుంది. 5.5 అడుగుల ఎత్తు ఉండి చామన చాయ రంగు కలిగిఉంటాడు. నలుపురంగు హాఫ్ హ్యాండ్స్‌షర్టు నలుపురంగు ట్రాక్ ధరించాడు. ఈమేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించి శృంగవరపుకోట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సమాచారం తెలిస్తే 9121109421, 9121109452 నంబర్లకు తెలియచేయాలి.

గంజాయి నిందితులకు రిమాండ్

కొమరాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):కూనేరు చెక్‌పోస్టు వద్ద ఆగస్టు 10న చేపట్టిన వాహన తనిఖీల్లో గంజాయితో పట్టుబడిన కేసులో ఒడిశాలోని కందమూల్‌జిల్లా బాలిగృహ బ్లాక్ తంగేరిగ్రామానికి చెందిన దిలీప్, మల్లిక్‌లను శనివారం అరెస్టు చేశామని కొమరాడ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు.వారిని పార్వతీపురం జూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ప్రవేశపెట్టగా వారికి న్యాయాధికారి రిమాండ్ విధించారని ఎస్ఐ వివరించారు.

భూమి స్వాధీనంపై ఇరువర్గాల వాగ్వాదం

లక్కవరపుకోట, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోల్డ్ స్టార్ జంక్షన్ వద్ద గల సుమారు 30 సెంట్ల భూమి వివాదంపై ఉత్కంఠ వీడింది. ఇటీవల కోర్టు ఇచ్చిన తీర్పును అనుసరించి వైసీపీకి చెందిన ఓ నేత నుంచి భూమిని స్వాధీనంపరుచుకుంటున్న సందర్భంలో శనివారం వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో పోలీసులు వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు..ఆర్జీపేటకు చెందిన జీవీఎస్ రాముకు 1990లో డాక్యుమెంట్ నెంబరు 542 ద్వారా గోల్డ్‌స్టార్ జంక్షన్‌లో సుమారు 30 సెంట్ల స్థలం దఖలుపడింది.ఈ భూమిపై అదేగ్రామానికి చెందిన పినిశెట్టి కిష్టమ్మ దొర కోర్టులో కేసువేశారు.టైటిల్ నిరూపించుకోకపోడంతో కోర్టు ఆ కేసును డిస్మిస్‌చేసింది. దీంతో సంబంధిత స్థలాన్ని హక్కుదారుడు రాము లెవిల్ చేస్తుండగా ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. దీంతో పోలీసు బందోబస్తు ఏర్పాటుచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

వైసీపీ నేతల కక్ష సాధింపు

- ఇంటి నుంచి బయటకు రానీయకుండాఇనుపకంచె ఏర్పాటు
- అలమండలో వీధి రోడ్డుపై మట్టిపోసిన వైనం



ఇంటి నుంచి బయటకు రాకుండా ఏర్పాటుచేసిన ఇనుప కంచె

జామి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలమండకు చెందిన రెండు ముస్లిం కుటుంబాలపై వైసీపీ నాయకుల కక్షసాధింపు చర్యలకు దిగారు. వారిని ఇంటి నుంచి బయటకు రానీయకుండా ఇనుప కంచెను ఏర్పాటుచేయడంతో పాటు ఆ వీధి రోడ్డుపై మట్టి పోగులు పోశారు. వైసీపీ నేతల నుంచి తమకు ప్రాణహాని ఉందని, వారి నుంచి రక్షణ కల్పించాలని గ్రామానికి చెందిన మైనార్టీ కుటుంబపెద్దలు షేక్‌మస్తాన్‌బీబీ, షేక్ పీర్ సాహెబ్ కోరుతున్నారు. శనివారం వారు మాట్లాడుతూ.. 'మేము గతంలో వైసీపీలో ఉండే వాళ్లం. ఆ పార్టీ పద్ధతులు నచ్చక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరాం. అప్పటినుంచి గ్రామంలోని వైసీపీ ప్రధాన నేతలు మాపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. మా ఆస్తులు ధ్వంసంచేసే కుట్ర చేస్తున్నారు. అనుక్షణం మాపై దాడికి యత్నిస్తున్నారు. ఈవిషయంపై ఇప్పటికే పలుమార్లు ఎస్పీ, జామి పోలీసులకు ఫిర్యాదుచేశాం. అయినా వైసీపీ నేతలు వారం రోజుల కిందట మా సొంత స్థలాల్లో ఇంట్లో నుంచి బయట అడుగు పెట్టనీయకుండా ఇనుప కంచెకట్టారు. వీధిలో పెద్దఎత్తున మట్టిపోసి మార్గాలు మూసేశారు. పోలీసులకు చెప్పడంతో వారు వచ్చి కొంతమేర ఇనుప కంచెను తీశారు. ఇంత దారుణంగా మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు. వారి నుంచి కాపాడండి.' అని కోరుతున్నారు. ఈవిషయంపై సీఐ అప్పలనాయుడును వివరణ కోరగా.. 'గ్రామ సచివాలయంలో ఇరువర్గాలతో చర్చలు జరిపాం. ఎవరి హక్కులకు ఎవరు భంగం కగించినా ఉపేక్షించేది లేదు. ఈ విషయంపై దర్యాప్తు చేస్తాం'. అని తెలిపారు. ఇదే విషయంపై అవతల వర్గం వారిని ప్రశ్నించగా.. మార్గమధ్యలో ముస్లింలు చికెన్ దుకాణం పెట్టారని, ప్రజలు ఇబ్బందిపడుతున్నారని, అందుకే కంచె ఏర్పాటు చేశామని తెలిపారు.

నేడు పైడిమాంబ కలశ జ్యోతి ఊరేగింపు

విజయనగరం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని పైడిమాంబ దీక్షాదారుల ఆధ్వర్యంలో ఆదివారం కలశజ్యోతి ఊరేగింపుకార్యక్రమం జరగనుంది. రైల్వేస్టేషన్ రోడ్డులో గల వనంగుడి వద్ద ప్రారంభమై, వైఎస్సార్ జంక్షన్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్, డాబాగార్డెన్ రోడ్డు, కన్యకాపరమేశ్వరీ ఆలయం, అక్కడి నుంచి గంటస్తంభం మీదుగా మూడులాంతర్ల వద్ద ఉన్న చదురుగుడికి చేరుకోనుంది. ఈమేరకు కలశ జ్యోతి ఊరేగింపు కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నేడు తిలతైలాభిషేకం

శృంగవరపుకోట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోట పుణ్యగిరి దిగువన గల పుణ్యతిరుమల గిరిక్షేత్రంలో ఆదివారం ఉదయం ఐదుగంటలకు పద్మావతిగోదా సమేత వేంకటేశ్వర స్వామికి తిలతైలాభిషేకం జరగనుంది. ఉదయం తొమ్మిది గంటలకు ఉత్సవమూర్తుల ఆలయ ప్రదక్షణ, స్వామివారి ఆస్థాన మహోత్సవం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు పురుషోత్తమ్ తెలిపారు.

నేడు మంత్రి దుర్గేష్ పర్యటన

రాజాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాజాంలో రాష్ట్ర పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం పర్యటించనున్నారని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ ఒకప్రకటనలో తెలిపారు. రాజాం కళాకారులు నిర్మించిన జీఎంఆర్ వరలక్ష్మి ఆడిటోరియం వేదికను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రాజాం, రేగిడి, సంతకవిటి, వంగర మండలాల నాయకులతోపాటు మునిసిపాలిటీలోని టీడీపీకూటమి నాయకులు విజయవంతం చేయాలని కోరారు.

ఎంసీ సభ్యుల కోసం పేర్లు నమోదు చేసుకోండి

కొత్తవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కోర్టుల్లో రాజీకి వీలయ్యే కేసులను రాజీ చేసేందుకు ఏర్పాటుచేసిన మధ్యవర్తిత్వం కమిటీ(ఎంసీ) సభ్యులుగా ఆసక్తి గల న్యాయవాదులు పేర్లను నమోదు చేసుకోవాలని కొత్తవలస న్యాయాధికారి డాక్టర్ విజయ్ చందర్ తెలిపారు. శనివారం కొత్తవలస కోర్టు హాలులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యవర్తిత్వం కమిటీ సభ్యులుగా న్యాయవాదులను నియమించి వారికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజీకి వీలు అయ్యే కేసులను ముందుగా మీడియేషన్ కమిటీకి పంపించి అక్కడరాజీ జరిగిన తర్వాత లోక్ అదాలత్‌లోరాజీచేయనున్నట్లు పేర్కొన్నారు.

దోచుకోవడమే నాయకుల పని

బొండపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల్లో దోచుకోవడం, దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని మాజీఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌ఆరోపించారు.శనివారం గొట్లాంలో మండల స్థాయి వైసీపీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చలంనాయుడు, చిన్నంనాయుడు, ఈశ్వరరావు పాల్గొన్నారు.

బోగస్ పింఛన్లపై విచారణ

రేగిడి, అకోబరు 18,(ఆంధ్రజ్యోతి): మండలంలోని కందిశలో ఏడుగురు బోగస్ పింఛన్లు అందుకుంటున్నరన్న ఫిర్యాదుపై ఎంపీడీవో శ్యామలాకుమారి ఆదేశాల ప్రాప్తికి ఎంఈవో వరప్రసాదరావు శనివారం సచివాలయంలో విచారణ నిర్వహించారు. ఈమేరకు గ్రామానికి చెందిన పైల బాలరాజు, లావేటి లక్ష్మణతో పాటు మరో ఐదుగురు తప్పుడు ధ్రువపత్రాలతో పింఛన్లు అందుకుంటున్నరని అదేగ్రామానికి చెందిన డి.గౌరినాయుడు ఇటీవల ఫిర్యాదుచేశాడు.ఈమేరకు విచారణకు అభియోగ పింఛనదారులు గైర్హాజరయ్యారు. గౌరినాయుడు విచారణకు హాజరై తన ఫిర్యాదుని వెనక్కి తీసుకొన్నట్లు పేర్కొని రాతపూర్వకంగా విత్‌డ్రా చేసుకుంటున్నట్లు తెలియజేశారని ఎంఈవో తెలిపారు.

నాణ్యమైన బోధన లక్ష్యం కావాలి

ఉపాధ్యాయులకు నాణ్యమైనబోధన, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి లక్ష్యంగా ఉండాలని ఎంఈవో-1, 2లు వరప్రసాదరావు,బి.ఎరకయ్యలు పేర్కొన్నారు.రేగిడి మండలంలోని కందిశ, లింగాలవలసలో నిర్వహించిన స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలను ఎంఈవో-1, 2లు వేర్వేరుగా పరిశీలించారు. అలాగే సంకిలి, ఏపీపురం, ఖండ్యాం తదితర పాఠశాలల్లో స్కూల్‌కాంప్లెక్స్ సమావేశాలు చైర్మన్లు నిర్వహించారు.

మండల సర్వేయర్‌గా శివాజీ

భోగాపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): మండల సర్వేర్‌గా జి.శివాజీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న మండల సర్వేయర్ మధుకేశవరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. దీంతో విజయనగరంలో విధులు నిర్వహిస్తున్న శివాజీని ఇక్కడ మండల సర్వేయర్‌గా నియమించారు.

బస్సులు కిటకిట.. రైళ్లల్లో రద్దీ

- దీపావళికి స్వస్థలాలకు చేరుతున్న ఉద్యోగులు, వలస కూలీలు



విజయనగరం బస్టాండ్‌లో బస్సెక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజయనగరం, ఎస్.కోట, చీపురుపల్లి తదితర రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు శనివారం కిటకిటలాడాయి. దీపావళి పురస్కరించుకుని వివిధ ప్రాంతాల్లోగల ఉద్యోగులు, వలస కూలీలు స్వస్థలాలకు రెండు రోజుల ముందుగానే చేరుకుంటున్నారు. దీంతో శనివారం తెల్లవారి నుంచే హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చే రైళ్లన్నీ రద్దీగా ఉన్నాయి. నగర, పట్టణ ప్రాంతాలన్న తేడాలేకుండా దీపావళిని కుటుంబ సభ్యులతో ఆనందంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఏర్పాట్లుచేసుకున్నారు. ఆదివారం,సోమవారం దీపావళి నేపథ్యంలో వరుస సెలవులు కావడంతో విజయనగరం నుంచి కూడా ఎక్కువ మంది తమ, తమ సొంత ప్రాంతాలకు బయలు దేరి వెళ్లారురైల్వే, బస్సు స్టేషన్‌ల్లో ప్రయాణికులు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు గంటలకొద్దీ వేచిఉండాల్సివచ్చింది.

పర్యావరణ దీపావళిపై అవగాహన

ఎస్.కోట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొట్టాం ప్రభుత్వోన్నతపాఠశాలలో శనివారం పర్యావరణ దీపావళిపై ఇన్‌చార్జి హెచ్‌ఎం రహీంషేక్ లాల్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. శబ్ద, వాయుకాలుష్యం వలన కలిగే అనర్థాలు వివరించడంతోపాటు పర్యావరణ పరిరక్షణ కలిగించే విధంగా ఎలా దీపావళి చేసుకోవాలో వివరించారు.

ప్రతి ఇంటా వెలుగులు నిండాలి: మంత్రి శ్రీనివాస్

విజయనగరం కలెక్టరేట్ అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా జరుపుకొనే దీపావళి వెలుగు,సంతోషం, ఐక్యత, ఆనందం నింపే పండుగని రాష్ట్ర ఎంఎస్ఎంఈ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి ఇంటిలో వెలుగు, ఆనందం, సుఖశాంతులు నిండాలని ఆశిస్తూపర్యావరణ హితంగా టపాసులుపేల్చి పండుగను జరుపుకోవాలని కోరారు. ఈ మేరకు జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

బాణసంచా విక్రయ స్థల పరిశీలన

కొత్తవలస, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని విజయనగరం ఆర్డీవో దాట్ల కీర్తి హెచ్చరించారు. శనివారం చింతలపాలెం గ్రామ రెవెన్యూపరిధిలోని సర్వేనెంబరు 32-2,3ల్లో దీపావళి టపాసులు విక్రయించేందుకు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటుకు చేసుకున్న దరఖాస్తులకు సంబంధించి స్థలాన్ని ఆమె పరిశీలించారు.ఈసందర్భంగా 516 బీ జాతీయరహదారి కోసం ఆస్తులను కోల్పోతున్న బాధితుల వివరాలను త్వరగా తయారుచేయాలని రెవెన్యూశాఖ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అప్పలరాజు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తే చర్యలు

రాజాం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు తప్పవని రాజాంటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా నిల్వచేసినా, విక్రయించినా సీజ్‌చేస్తామని పేర్కొన్నారు.రాజాంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి లైసెన్స్ తీసుకున్న వారే అమ్మకాలు చేయాలని తెలిపారు. గ్రామాలు, కాలనీల్లో ఇళ్లదగ్గర, పట్టణంలో నాలుగుచక్రాల బళ్లు, బడ్డీల్లో అమ్మేవారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తారాజువ్వల పోటీల ముసుగులో ఇబ్బందిపెట్టవద్దు

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకల్లో భాగంగా తారాజువ్వలు పోటీల ముసుగులో సామాన్య ప్రజలను ఇబ్బందులు పెడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ గణేష్ హెచ్చరించారు. జరజాపుపేట, రామతీర్థం జంక్షన్, మొయిదజంక్షన్, నెల్లిమర్ల కొన్ని ప్రాంతాల్లో ఆకతాయిలు తారాజువ్వల పోటీలు పేరుతో వాటిని ఒకరిపై ఒకరు విసురుకొని, ఆ వీధుల్లో గల సామాన్యులకు ఇబ్బందులు కలిగిస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని ఎస్ఐ గణేష్ తెలిపారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టప్రకారంచర్యలు ఉంటాయని హెచ్చరించారు.స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏదైనా ప్రమాదం జరిగితే జైలుకు కూడా పోయే పరిస్థితి ఏర్పడవచ్చని తెలిపారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే



సారిపల్లి గ్రామస్థులతో మాట్లాడుతున్న లోకం నాగమాధవి

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ధ్యేయమని, ప్రజల సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు.శనివారం మండలంలోని సారిపల్లి గ్రామంలో మనప్రజలతో -మన ఎమ్మెల్యే కార్యక్రమంలోభాగంగా గ్రామస్థులతో మాట్లాడారు.ఈసందర్భంగా స్థానికులు గ్రామంలోని డ్రైనేజీ సమస్యలు, రోడ్లదుస్థితిని ఆమెకు వివరించారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఉమ్మడివ్యూహంతో ముందుకువెళ్తున్నారని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చనమల్ల వెంకటరావు, టీడీపీ నాయకులు బి.ఆదినారాయణ, సారిపల్లి బాబురావు, వెంకటరావు, గోపాలమూర్తి, జనసేన పార్టీ నాయకులు మజ్జి రామారావు, కరమజ్జి గోవిందరావు, అంబల్ల అప్పలనాయుడు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి తోడ్పడాలి: డీపీవో

గజపతినగరం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): చెత్తసంపద కేంద్రాల్లో వర్మికంపోస్టు తయారుచేసి పంచాయతీలకు ఆదాయ వనరులు తీసుకొచ్చి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని డీపీవో డి.మల్లిఖార్జునరావు తెలిపారు. శనివారం గజపతినగరం చెత్తసంపద కేంద్రం వద్ద శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో జనార్దనరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తను వేరు చేయడంపై అవగాహన

రాజాం అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోపేరులో చెత్తను వేరు చేయడంపై శనివారం ఎంపీడీవో జె.ఆనందరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద సీఆర్పీలకు,క్లాప్‌మిత్రలకు తడిచెత్త పొడిచెత్త వేరుచేసేవిధానంపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పొందిన సీఆర్పీలు కేటాయించి 1000 కుటుంబాలకు గాను రోజుకు 50 కుటుంబాలు చొప్పున ఇంటింటికి వెళ్లి 20 రోజులపాటు అవగాహన కల్పించాలని కోరారు.కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసరావు, రాజాం, వంగర, సంతకవిటి, రేగిడి మండలాలకు చెందిన మహిళా సంఘాలు, రిసోర్స్‌పర్సన్ సుప్రియ, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

అర్హులందరికీ డ్రిప్ ఇరిగేషన్: పీడీ

వేపాడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అర్హులైన రైతులందరికీ డ్రిప్ ఇరిగేషన్ పథకం కింద బిందు సేద్యం వ్యవసాయ పరికరాలను అందజేయనున్నట్లు జిల్లా ఏపీ ఎంఐపీ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం మండలంలోని వీలుపర్తిలో ఓ రైతు మైక్రో ఇరిగేషన్ పథకంలో భాగంగా సాగుచేసిన పంటలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదెకరాల్లోపు ఉన్న షెడ్యూల్ కులాల వారికి 100 రాయితీపై అందజేయనున్నట్లు తెలిపారు. వీరికి గరిష్టంగా 2.18 లక్షల ప్రోత్సాహం అందజే యనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ పవన్ పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలి



ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

బొండపల్లి, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు అన్నిరంగాల్లో ముందున్నప్పుడే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని సాయి సిద్ధార్థ విద్యా సంస్థల చైర్మన్ శీరంరెడ్డి చంద్రశేఖర్ తెలిపారు. శనివారం బొండపల్లిలోని ఓ ప్రైవేటు హాలులో ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు.ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఒక్కటే ముఖ్యం కాదని, అలాగని చదువును నిర్లక్ష్యంచేయరాదని చెప్పారు. తమకు ఇష్టమైన రంగాలను గుర్తించుకొని ముందుకుసాగితే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు.అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలేజీ ఏవో గౌరినాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

104 ద్వారా మెరుగైన సేవలు

డెంకాడ, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 104 వాహనం ద్వారా మెరుగైన సేవలను అందించాలని సిబ్బందికి ఎన్టీఆర్ ట్రస్టు ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సాయిరామ్, జిల్లా ఇన్‌చార్జి మేనేజర్ నరసింహమూర్తి సూచించారు. శనివారం మండలంలోని మోపాడ పీహెచ్‌సీ పరిధిలో జొన్నాడ పంచాయతీ దువ్వపేటలో 104 వాహనంలో ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా వారు రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో డీఈవో సంతోష్, డ్రైవర్ మధు పాల్గొన్నారు.

120 మందికి వైద్య పరీక్షలు

డెంకాడలో 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇక్కడ దాట్ల మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో దాట్ల శ్రీకాంత్‌బాబు,వైద్యులు బి.శ్రీను, పి.శైలజ వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు రొంగలి కనకసింహాచలం,దాట్ల సత్యనారాయణ, డి.ప్రదీప్‌రాజు, సిరికి అప్పారావు, రంగారాజు, విజయరామరాజు, బుజ్జి పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు అంతరాయం

విజయనగరం టౌన్,అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కొత్త అగ్రహారం నీళ్ల ట్యాంకు పంపింగ్ వాల్ పాడవడంతో రెండురోజులపాటు తాగునీరు పంపిణీకి అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య ఒక ప్రకటనలో శనివారం తెలిపారు. మరమ్మతులు ఇప్పటికే ప్రారంభించామని పేర్కొన్నారు. ట్యాంకు పరిధిలో ఉన్న లంకాపట్నం,నాగవంశం వీధి, పుచ్చలవీధి, హుకుంపేట, బూర్లిపేట, కొత్తఅగ్రహారం,ఉల్లివీధి, వైష్ణవవీధుల్లోని స్థానికులు గమనించి సహకరించాలని కోరారు.

వాయు కాలుష్యం తగ్గించాలి: ఎంపీడీవో

భోగాపురం, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకొని వాయు కాలుష్యన్ని తగ్గించేలాచర్యలు తీసుకోవాలని ఎంపీడీవో డి.స్వరూపరాణి కోరారు. శనివారం భోగాపురంలో కాలుష్యనివారణపై అవగాహన కార్యక్రమంలో భాగంగా సిబ్బందితో ప్రతిజ్ఞచేయించి, మానవహారం, సైకిల్‌ర్యాలీ నిర్వహించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరు సైకిల్ ఉపయోగిస్తే వాయుకాలుష్యం తగ్గడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ గాయిత్రి, నాయకులు కె.సుభోషణరావు, ఆళ్ల శ్రీనివాసరావు, పల్లంట్ల జగదీష్, బొల్లు త్రినాధు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో డీఎన్ఏ కీలకం

నెల్లిమర్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి):సాధారణ ప్రకృతి విపత్తులు లేదా వివిధ సంక్లిష్ట నేరాలలో మానవదేహాలను గుర్తించేందుకు, నేర పరిశోధనకు డీఎన్ఏ ఆధారం కీలకమని హైదరాబాద్ బ్రిక్-సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్ (సీడీఎఫ్‌డీ) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్.మధుసూదనరెడ్డి తెలిపారు. శనివారం సెంచూరియన్‌విశ్వవిద్యాలయంలో ఇన్నోవేషన్స్ ఇన్‌డీఎన్ఏ ఫింగర్‌ప్రింటింగ్ అన్న అంశంపై మాట్లాడారు.డీఎన్ఏ విషయంలో ఎదురవుతున్న సవాళ్లు తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంతకుమార్ మహంతి, ఫొరెన్సిక్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ రవికుమార్, అసోషియేట్ ప్రొఫెసర్ షైరాక్‌దాస్, విభాగాధిపతి డాక్టర్ నాగజోగయ్య పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలి

రాజాం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ పేరిట వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు.శనివారం రాజాంలో ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సంపదపై ప్రైవేటు పెత్తనమేంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న పది మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధంకావడాన్ని తప్పుపట్టారు. పేదలకు ప్రభుత్వ వైద్యం అందాలంటే కళాశాలలను ప్రభుత్వరంగంలోనే నిర్మించాలని డిమాండ్ చేశారు.

రైతులు ఈ-క్రాప్ చేయించుకోవాలి: ఏడీఏ

నెల్లిమర్ల, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి):రైతులు తమ పంటలకు తప్పనిసరిగా ఈ-క్రాప్ చేయించుకోవాలని వ్యవసాయశాఖ ఏడీఏ కోటేశ్వరరావు సూచించారు. ఈ మేరకు సిబ్బందికి అవగాహన కల్పించాలని ఆదేశించారు. నెల్లిమర్ల వ్యవసాయ కార్యాలయంలో ఏవోశ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఏఈవోలు, వీఏఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ డేటా బుకింగ్ చేయాలని ఆదేశించారు.

నమ్మించి గొంతు కోశారు

- బొడ్డవరలో 120వ రోజుకు చేరిన నిర్వాసితుల దీక్షలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): భూసేకరణ సమయంలో అప్పటి కలెక్టర్, జేసీ, ఆర్డీవోలు మీకు మేము అండగా ఉంటామని నమ్మించి మా గొంతు కోశారని జిందాల్‌నిర్వాసితులు వాపోయారు. తమకు న్యాయంజరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టంచేశారు. శనివారానికి బొడ్డవరలో చేపట్టిన రిలేదీక్షలు 120 రోజుకు చేరాయి.ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తమభూముల్లో అక్రమంగా ప్రవేశించి వాల్టా చట్టం ఉల్లఘించి పం డ్లతోటలు, పంటలు నాశనంచేస్తున్న జిందాల్ యాజమాన్యాన్ని ల్యాండ్ గ్రాబింగ్ చట్టం ప్రకారం అరెస్ట్‌చేయాలని కోరారు.

ఎప్పుడిస్తారో?

(7వ పేజీ తరువాయి)

జిల్లాకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో మలేరియా, డెంగ్యూ జ్వర ప్రభావిత గ్రామాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వారంతా దోమ తెరల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో 698 మలేరియా ప్రభావిత గ్రామాలు ఉన్నట్లు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. వీటిల్లో 90 హైరిస్క్ గ్రామాలు కూడా ఉన్నాయి. ఆయా గ్రామాల్లో ప్రజలకు దోమ తెరల అవసరం ఎంతైనా ఉంది. ఇదిలా ఉండగా కొన్ని గిరిజన గ్రామాల్లో ప్రజలకు దోమ తెరల వినియోగంపై అవగాహన కల్పించాల్సి ఉంది. లేదంటే చేపలు పట్టడానికి, మొక్కలకు కంచెలా వినియోగించనున్నారు.

పెరుగుతున్న కేసులు

జిల్లాలో 37 పీహెచ్‌సీలు, ఐదు యూపీహెచ్‌లు, మూడు సీహెచ్‌సీలు, మూడు ఏరియా ఆసుపత్రులు, జిల్లా కేంద్ర ఆసుపత్రి పరిధిలో రక్త నమూ నాలు సేకరించి తదనుగుణంగా వైద్య సేవలు అందిస్తున్నారు. మరణాలు లేకపోయినప్పటికీ కేసుల పెరుగుల వైద్య ఆరోగ్య శాఖకు తీవ్ర తలనొప్పిగా మారింది. మరోవైపు వ్యాధి తీవ్రతను తగ్గించడానికి హైరిస్క్ గ్రామాల్లో యాంటీ లార్వల్ స్ప్రేయింగ్ కాలువల శుభ్రత, డ్రైడే, తదితర కార్యక్ర మాలు చేపడుతున్నా.. కేసులు పెరుగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు దృష్టిసారించి దోమ తెరల పంపిణీకి తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ధాన్యం కొనుగోలుకు ముందే..

(7వ పేజీ తరువాయి)

జారీ చేశారు. ధాన్యానికి సంబంధించి 17 శాతంలోపు తేమ శాతం ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. మొత్తంగా గతంలో నెలకొన్న సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం ధర నిర్ణయించింది. సాధారణ రకం క్వింటాకు రూ. 2,369, గ్రేడ్-ఏ రకానికి రూ. 2,389గా ప్రకటించింది.

సిబ్బంది కేటాయింపు

ధాన్యం కొనుగోలుకు సంబంధించి మండలాలకు ప్రత్యేకాధికారులను నియమించారు. తహసీల్దార్, వ్యవసాయాధికారి, పౌర సరఫరాల ఉప తహసీల్దార్, ప్రతి మిల్లుకు కస్టోడియన్ అధికారులుగా వీఆర్వో, కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లును నియమించనున్నారు.

నిబంధనల మేరకు కొనుగోలు

'ప్రభుత్వ నిబంధనలు, నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఖరీఫ్ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తాం. రైతులకు అసౌకర్యం కలగకుండా మిల్లులను పరిశీలిస్తున్నాం. వాటి నివేది కలను జిల్లా అధికారులకు అందిస్తాం. కొనుగోలు కేంద్రాల పరిధిలో అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.' అని పౌర సరఫరాల విభాగం ఉప తహసీల్దార్ మారుతీరావు తెలిపారు.

2028 నాటికి ఎలక్ట్రికల్ బస్సులు

(7వ పేజీ తరువాయి)

కూడా వాస్తవమే, ఆ సమస్యను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. జిల్లాకు అదనంగా ఆర్టీసీ బస్సుల కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వానికి లేఖ రాశామని వెల్లడించారు. అనంతరం జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో, గ్యారేజీలో సమస్యలపై డీపీటీవో వెంకటేశ్వరరావును అడిగి తెలుసు కున్నారు. డ్రైవర్లు, కండక్టర్లపై పని భారం తగ్గించాలని, దీర్ఘకాలక సమస్యలను పరిష్కరించాలని ఈయూ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, పార్వతీపురం డిపో కార్యదర్శి కె.నర్సింగరావు తదితరులు ఈడీకి వినతిపత్రం అందజేశారు. బస్సుల సంఖ్యను పెంచాలని, డిపో కార్యాలయ, గ్యారేజీ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. కొత్తగా టిక్కెట్లు కొట్టే టిమ్ మిషన్లు పంపిణి చేయాలన్నారు. ఈడీ వెంట పార్వతీపురం డిపో ఇన్‌చార్జి మేనేజర్ లక్ష్మణరావు, తదితరులు ఉన్నారు.

స్వచ్ఛాంధ్రపై ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పాలకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హరగోపాల్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం కళాశాలలో విద్యార్థులతో స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కాలుష్య నివారణకు విరివిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో వెలమల అప్పారావు, నాగభూషణరావు, శంకరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన గాలిపై అవగాహన

పాలకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వచ్ఛమైన గాలి ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర సెల్, ఎన్ఎస్ఎస్-1, 2 యూనిట్లు.. ఐక్యూ ఏసీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయమణి మాట్లాడుతూ స్వచ్ఛమైన గాలి మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి చాలా అవసర మన్నారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆమంచి శ్రీనివాసరావు, అధ్యాపకులు శాంతి, రాఘవేంద నాయుడు, శ్రీని వాసరావు, రాజ్యలక్ష్మి, జగన్మోహన్‌రావు, రామారావు, శంకరరావు, తిరుపతిరావు, గుర్రయ్య, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న సంతోష్‌కుమార్

పాలకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముదునూరు వారి వీధిలోగల కోదండరామ ఆలయం అభివృద్ధికి టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్ రూ.50 వేలు విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని శనివారం ఆలయ కమిటీ సభ్యులకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో నందాన రమేష్, లక్ష్మణరావు, కె.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని పక్కాగా అమలు చేయాలి

పాలకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏపీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు కోరారు. పార్వతీపురంలో తలపెట్టిన వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను శనివారం పట్టణంలో ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 22న నిర్వహించనున్న మహాసభలను అందరూ విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు దూసి దుర్గారావు, సింహాచలం పాల్గొన్నారు.

ఘనంగా బాలికా దినోత్సవం

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పీటీజీ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మండల ప్రత్యేకాధికారి తోట కనకదుర్గ పా ల్గొని మాట్లాడారు. బాలికలు అన్నిరంగాల్లో ముందు ఉండాలని ఆకాంక్షించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజయగౌరి ఉన్నారు.

ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోండి


చీపురుతో శుభ్రం చేస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కోరారు. శనివారం లక్కగూడలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కడ్రక కళావతి, మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్, ఎస్టీ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు, భూషణ్, బీజేపీ కన్వీనర్ అప్పలస్వామి, దొరబాబు తదితరులున్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెల్ల గ్రామంలో శనివారం అంగన్‌వాడీ భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తొందరగా పనులు ప్రారంభించి భవన నిర్మాణం పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం నూతన జీఎస్టీ విధానంపై అవగాహన కల్పించారు. బాలికా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, సీడీపీవో విజయకుమారి, ఎస్టీ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు, కూటమి నాయకులు అడ్డాకుల నరేష్, కడ్రక అప్పలస్వామి, భూషణరావు, బాస్కరరావు, సర్పంచ్ మండంగి శంకరరావు, క్రాంతికుమార్, పాడి సుదర్శనరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

●గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): గుమ్మలక్ష్మీపురంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజల నుంచి ఆమె వినతులను స్వీకరించారు. సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అడ్డాకుల నరేష్, బత్తిలి శ్రీను తదితరులున్నారు.

పర్యావరణహిత మార్గమే శరణ్యం


మొక్క నాటుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మెరుగైన ఆరోగ్యానికి స్వచ్ఛమైన గాలి అవసరమని, అందరూ పర్యావరణహిత మార్గాన్ని అవలంబించాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు అన్నారు. శనివారం ఆయన డోకిశీల పీహెచ్‌సీ, గిరిజన సంక్షేమ హాస్టల్‌ను ప్రోగ్రాం అధికారులతో కలిసి సందర్శించారు. హాస్టల్, ఆసుపత్రిల్లో పరిసరాల శుభ్రతపై పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర సందర్భంగా పలు ఆరోగ్య అంశాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ నెల సారాంశం క్లీన్ ఎయిర్ అని వివరించారు. గాలి స్వచ్ఛతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని గుర్తుచేశారు. కలుషితమైన గాలి వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. అనంతరం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర నోడల్ అధికారి టి.జగన్మోహనరావు, డీఐవో డాక్టర్ విజయమోహన్, ఆర్‌బీఎస్‌కె పీవో డాక్టర్ టి.జగన్మోహన్‌రావు వైద్యులు స్నిగ్ధ, సూపర్‌వైజర్ జయ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి


మాట్లాడుతున్న న్యాయసేవా విభాగం అధ్యక్షురాలు హరిప్రియ

సీతంపేట రూరల్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణగా రూపొందించిన చట్టాలపై పూర్తిగా వారు అవగాహన పెంచుకోవాలని న్యాయసేవా విభాగం అధ్యక్షురాలు హరిప్రియ సూచించారు. స్థానిక ఏపీఆర్ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం గిరిజన బాలికలకు రక్షణ చట్టాలు, న్యాయపరమైన సలహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు ధైర్యంగా ఉంటు సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూర్యకుమారి, పాలకొండ బార్ అసోసియేషన్ సభ్యులు మూర శామ్యూల్, రామ్మోహనరావు, కుమారస్వామి, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల పరిశీలన


పరిశీలన చేస్తున్న దృశ్యం

సాలూరు రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం రాపిడ్ రెస్పాన్స్‌బులిటీ టీం వైద్యులు శరత్‌బాబు, విజయబాబు, నారాయణరావు, భవానీ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు వంటగదిలో వంటల తీరు చూశారు. విద్యార్థులు తింటున్న ఆహారం, స్నానపు గదులు, మరుగుదొడ్లు తదితర వాటిని పరిశీలించారు. పలువురు విద్యార్థులను ఎంపిక చేసి వారితో మాట్లాడి పలు విషయాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో సాలూరు మలేరియా యూనిట్ అధికారి ఈశ్వరరావు ఉన్నారు.

తోటపల్లిలో శ్రీవారి సేవకులు

గరుగుబిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చిన్నతిరుపతిగా ప్రసిదిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవాలయాలకు శ్రీవారి సేవకుల సంఖ్య పెరుగుతోంది. స్వామివారి దర్శనానికై వచ్చే భక్తులకు మెరుగైన సేవలందించేందుకు అధిక సంఖ్యలో సేవకులు పలు ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు. శనివారం జియ్యమ్మవలస మండలం చినమేరంగి, మండలంలోని నాగూరుకు చెందిన 65 మంది సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థానంలో సేవలు అందించేందుకు సుమారు వెయ్యి మందికి పైగా నమోదయ్యారని అభివృద్ధి ట్రస్ట్ ప్రతినిధి ఎం.వాసుదేవరావు తెలిపారు.

తెలంగాణలో బంద్‌కు సంఘీభావం

గరుగుబిల్లి, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని బీసీ సంఘాలకు సంఘీభావంగా శనివారం మండలంలోని ఖడ్గవలస సముదాయంలో బీసీ సంఘాల నేతలు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవాల రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణలో 42 శాతం స్థానిక సంస్థలకు సంబంధించి చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు అమలు చేసిన తదుపరి ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ప్రజా సమస్యలపై వినతుల స్వీకరణ


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నర్సిపురం పంచాయతీ పరిధిలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ప్రజా సమస్యలపై వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు అందిస్తున్న వినతులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలో గతంలో ఎప్పుడూ లేని విధంగా అభివృద్ధి జరుగుతోందని వివరించారు.

పర్యావరణాన్ని కాపాడండి

బెలగాం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పిలుపునిచ్చారు. బెలగాంలోని 18, 19 వార్డులకు చెందిన శ్మశానవాటికలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గాలి కాలుష్యం అనేక అనారోగ్యాలకు కారణమన్నారు. ఈ నేపథ్యంలో కాలుష్య నివారణకు ప్రతిఒక్కరూ తమ ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు.

కోటి సంతకాలు సేకరణలో నేతలు

పాలకొండ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా భాసూరు, బెజ్జి గ్రామాల్లో శనివారం ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కనపాక సూర్యప్రకాశ్, నల్లి శివప్రసాద్, రణస్థలం రాంబాబు, బలగ మన్మథరావు, మల్లేశ్వరమ్మ, శివ్వాల శ్రీనివాసరావు, కోట అజయ్‌బాబు, గురివినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా


విద్యార్థితో మాట్లాడుతున్న కృష్ణవేణి

సాలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన సంక్షేమ వసతి గృహం, గురుకులం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని శనివారం ఏటీడబ్ల్యూ కృష్ణవేణి ఆరా తీశారు. ఆసుపత్రికి వెళ్లి అక్కడ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో ఆమె మాట్లాడుతూ సాలూరు ఏరియా ఆసుపత్రిలో 10మంది విద్యార్థులు వివిధ కారణాలతో ఆసుపత్రిలో చేరారన్నారు. అయితే శనివారం నాటికి ఐదుగురి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడడంతో వారిని డిశ్చార్జ్ చేశారన్నారు. మిగతా వారిని కూడా ఒకటి, రెండు రోజుల్లో డిశ్చార్జ్ చేస్తారని తెలిపారు. ఆమె వెంట పలువురు ఐటీడీఏ ఉద్యోగులు ఉన్నారు.

లారీ బోల్తా: తప్పిన ప్రమాదం

భామిని, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విశాఖ నుంచి ఛత్తీస్‌గఢ్ బొగ్గు లోడుతో వెళుతున్న లారీ కొత్త పసుకుడి సమీపంలో శుక్రవారం రాత్రి బోల్తాడింది. విషయం గమనించిన స్థానికులు క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్‌ను బయటకు తీసి సపర్యలు చేశారు. డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. రహదారి మలుపు తెలియక రోడ్డు దిగడంతో లారీ బోల్తా పడిందని డ్రైవర్ తెలిపాడు. ఆ ప్రాంతంలో కొద్ది రోజులు కిందట ఇదే మలుపులో లారీ బోల్తా పడింది. మలుపులు వద్ద ఆర్అండ్‌బీ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడమే ఇందుకు కారణమని స్థానికులు అంటున్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

సీతానగరం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న 104 సంచార వైద్య సేవ వాహనాల ద్వారా మెరుగైన సేవలందించాలని జిల్లా మేనేజరు ఎస్.కృష్ణ ఆదేశించారు. 104 వాహనాల ఆకస్మిక తనిఖీల్లో భాగంగా శనివారం పెదంకలాం పీహెచ్‌సీలో 104 వాహనాన్ని ఆయన పరిశీలించారు. గ్రామాల్లో వైద్యాధికారి పర్యవేక్షణలో వ్యాధి నిరోధక పరీక్షలకు అవసరమైన పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ధాన్యం కొనుగోలులో ఆటంకాలు కలిగించవద్దు


మాట్లాడుతున్న తహసీల్దార్ బాల

గరుగుబిల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు సమయంలో మిల్లర్లు ఆటంకాలు కలిగించవద్దని తహసీల్దార్ పి.బాల అన్నారు. శనివారం మండల రెవెన్యూ కార్యాలయంలో మండలంలోని మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు మిల్లర్లు సహకరించాల న్నారు. తేమ శాతం పేరుతో రైతులను ప్రలోభాలకు గురిచేయరాద న్నారు. ధాన్యం సేకరణకు అవసరమైన హమాలీలు, గోనె సంచులు, తదితర సామగ్రి అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు అసౌకర్యం కల్పించకుండా కొనుగోలు చేపట్టాలన్నారు. నిబంధనలు ధిక్కరించే మిల్లర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి టి.జ్యోత్స్న, డీటీ మారుతీరావు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం తగదు

●రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అనారోగ్యం, మరణాలపై వైకాపా నేతలు తప్పుడు ప్రచారం చేయడం తగదని గిరిజనశాఖ సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శనివారం క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇటీవల ఆశ్రమ, గురుకుల పాఠశాలల విద్యార్థులు అనారోగ్యానికి గురైన ఘటనపై వైసీపీ నేతలు చేస్తున్న నిరాధార ఆరోపణలను ఖండించారు. విద్యార్థుల ఆరోగ్యం వంటి సున్నితమైన అంశంపై అబద్దాలు చెప్పి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుండటంపై మండిపడ్డారు. ఇద్దరు విద్యార్థులు మృతి చెందితే 11 మంది చనిపోయారని అసత్య ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందిన విద్యార్థులందరూ కోలుకుంటున్నారని, ఎటువంటి తీవ్రమైన పరిస్థితి లేదని వైద్యులు స్పష్టం చేశారన్నారు. సూపర్‌సిక్స్ కార్యక్రమం సూపర్ హిట్ అవ్వడంతో వైకాపా నేతలు తట్టుకోలేక అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారన్నారు. విశాఖకు గూగుల్ రాకతో ప్రపంచం హర్షిస్తుంటే వైకాపా నేతలు మాత్రం గగ్గోలు పెడుతున్నారన్నారు. మెడికల్ కళాశాలలు నిర్మించకుండా వాటి దగ్గర ధర్నాలు చేయడం హాస్యాస్పదమన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై లోకేశ్ ఆరా

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై స్థానిక విలేకరులతో మంత్రి మాట్లాడుతున్న సమయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఆమెకు ఫోన్ చేసి విద్యార్థుల ఆరోగ్యపరిస్థితిపై ఆరా తీశారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆయన లోకేశ్ ఆదేశించారని తెలిపారు. సమావేశంలో ఏఎంసీ ఛైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, గుళ్ల వేణగోపాలనాయుడు, యుగంధర్. బృందావనం అశోక్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

డీఏ మంజూరు అభినందనీయం


కిశోర్

పార్వతీపురం, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏ లో ఒక డీఏను ముఖ్యమంత్రి చంద్రబాబు మంజూరు చేయడం అభినందనీయమని ఏపీ ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ఎస్ కిశోర్ అన్నారు. శనివారం రాత్రి ఆయన పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం ఆనందంగా ఉందన్నారు. ఆరోగ్య కార్డులు మంజూరుకు కృషి చేస్తామని సీఎం చెప్పడం సంతోషమన్నారు. గతంలో చైల్డ్ కేర్ లీవ్ 18 ఏళ్ల లోపు వాడుకోవడం ఉండేదని కానీ ఇప్పుడు రిటైర్మెంట్ లోపు వాడుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించడం వల్ల దీర్ఘకాల సమస్యకు పరిష్కారం దొరికిందని అభిప్రాయపడ్డారు. సంఘ భవనాలకు ట్యాక్స్ రద్దు చేయడం త్వరలోనే పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

పాముకాటుతో మహిళ మృతి


విజయలక్ష్మి (ఫైల్)

సాలూరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గుమ్మడం వార్డుకు చెందిన మూడడ్ల విజయలక్ష్మి (50) శనివారం మధ్యాహ్నం పాముకాటుతో మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలో గుమడానికి చెందిన విజయలక్ష్మి శనివారం మొక్కజొన్న గింజలను ఆర బెట్టిన అనంతరం తన పొలంలో ప్రత్తి పంటను చూసేందుకు వెళ్లారు. అక్కడ ఆమెకు పాము కాటేసింది. దాంతో ఆమెను 108 వాహనంపై సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందినట్టు వై ద్యులు నిర్ధారించారు. దాంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతురాలికి భర్త శివున్నాయుడు, కుమారులు కుమారస్వామి, ప్రసాద్ ఉన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించండి


వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామ పెద్దలు

పార్వతీపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని జియ్యమ్మవలస మండలం పెద్దబుడ్డిడి గ్రామ పెద్దలు కోరారు. శనివారం ఆర్టీసీ ఇన్‌చార్జి డీఎం లక్ష్మణరావును పార్వతీపురం డిపో గేటు వద్ద కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మూడేళ్ల కిందటి వరకూ పార్వతీపురం నుంచి జియ్యమ్మవలస మండలంలోని పెద్దబుడ్డిడి గ్రామానికి బస్సు సర్వీసు ఉండేదన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా బస్సు సౌకర్యాన్ని నిలిపి వేయడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. బస్సు సర్వీసును పునరుద్ధరించడం వల్ల నాగూరు, తురకనాయుడు వలస, లఖణాపురం, రావివలస గ్రామాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. వినతపత్రం అందజేసిన వారిలో బాబు భువన మోహనరావు, ఆర్.తిరుపతిరావు, ఆర్.శశిభూషణరావు తదితరులున్నారు.

ఐటీడీఏలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర

సీతంపేట రూరల్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఐటీడీఏ ఇన్‌చార్జి ఏపీవో ఆర్‌పీ గణేష్ ఆధ్వర్యంలో ఐటీడీఏ సిబ్బంది కార్యాలయ పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఉద్యోగులు స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేశారు. ఏవో సునీల్, జీసీడీవో రాములమ్మ, ఏపీడీ శ్రీహరి పాల్గొన్నారు.